అభాగిని

శ్రీ ఆమంచర్ల మల్లికార్జునరావు

అది ఒక పెద్ద భవంతి. ముందువైపున చక్కని పూతోటవుండి ఆ భవంతికి శోభను చేకూరుస్తున్నాది. అది సాయం సమయం. భవంతిలోనికి అప్పుడేవచ్చి నిలిచింది ఒక కారు. సరిగా ఆ సమయానికి గదిలోని గోడగడియారం టంగ్, టంగ్ మంటూ ఆరు గంటలు కొట్టింది. అప్పటివరకు నర్సింగ్ హోంలో పనిచూచుకొని తిరిగివచ్చి, కారుదిగిన డాక్టర్ రామారావు ఇంటిలోపలికి వెళ్ళబోతుంటే, ఇంటి నౌకరు పెద్ద పెద్ద కేకలు పెట్టుతూ, గేటువద్ద ఎవరినో అదిలించి పొమ్మనడం వినిపించింది. రంగడు (నౌకరు) కేకలకు ఆవలివైపునవున్న వ్యక్తి లక్ష్యంచేసినట్లులేదు - ఆ వ్యక్తి దీనంగా "బాబూ! కానీ డబ్బులు దానంచేయండి! మీకు దణ్ణం 'బెడతాను" అని ప్రాధేయపడుతున్నది. యాచించే వ్యక్తి స్త్రీ అనే అనుమానంగలిగి డాక్టర్ సరాసరి గేటువద్దకు వెళ్ళాడు. గేటు కమ్మీల నానుకొని అందులోనుంచి చేతులుజాపి నిలబడివుంది ఒక స్త్రీ. గేటువైపువచ్చి డాక్టరు వైపుకు చెయ్యిజాపి "ధర్మం చేయండి బాబయ్యా! ఆకలితో అలమటించిపోతున్నాం. కలిగిన మహాత్ములు మీరే యింత దానధర్మంచేయాలి - లేకపోతే మాగతేంగాను - బ్రతకగలమా" అంది ఆ స్త్రీ. ఆమె కడుపిన్న వయసులోవుంది. వుంటే 20-22 సంవత్సరాల ప్రాయం వుండవచ్చు. బీదరికంవల్ల బక్కచిక్కి, కట్టుగుడ్డలు మాసిన పాత్తలతోవుంది. బీదరికం అనుభవిస్తున్నా, బక్కచిక్కినా, ఆమె మొహంలో ఒక రకమైన కళాకాంతులు శోభిస్తున్నాయి. డాక్టర్ ఆమెతో "దాన ధర్మాలకు ఎగబడక కష్టించి పనిచేసుకోలేకపోయావు - దిట్టంగానే వున్నావే?" అని ప్రశ్న వేసాడు. సాధారణంగా అలాంటిప్రశ్న యాచించిన ప్రతి వ్యక్తికి, ఎదుటి వ్యక్తి దానంచేసినా లేకపోయినా ప్రశ్నించే మొదటి ప్రశ్న అదే.

కాని ఆమె డాక్టర్‌కు చక్కని సమాధానమిచ్చింది. "నిజం బాబూ! యాచించక బ్రతకాలి! కాని ఈ యాచనచేస్తూ జీవించడం నా కోసంకాదు! ఇటు చూడండి. అదిచూచి మీరేం చేయమన్నా చేస్తాను" అని ఆ స్త్రీ డాక్టర్‌కు తన వెనకవైపున ఒక దృశ్యాన్ని చూపింది. ఆ దృశ్యాన్ని చూచిన ఏ వ్యక్తిగూడా అతని జన్మలో ఆ దృశ్యాన్ని మరువలేడు. అష్టవంకరలూ తిరిగి, కాలు చేతులూ తన స్వాధీనంలేని ఒక పురుషుడు - కొయ్యపెట్టెలో కూర్చొనివున్నాడు - కొయ్యపెట్టెకు చక్రాలు అమర్చబడివున్నై, ముందువైపున దాన్ని ఈడ్చుకుపోడానికి వీలుగా పెద్ద తాడొకటి కట్టబడింది. ఆ పురుషుని శరీరంలోని ప్రతి అవయవాన్ని ప్రతి నరనరాన్ని పక్షవాతపు రోగం లోబరుచుకొంది. అతను కూపస్థమండూకంలా ఆ పెట్టెలోనే జీవితాన్ని గడుపుతున్నాడు. అతని వయస్సు 25 సంవత్సరాలు వుండవచ్చు. మొదట కఠినంగా మాట్లాడినా అతన్ని చూచిన తరువాత వాళ్ళెవరో తెలుసుకోవాలనేకోరిక జనించింది.

ఆమెతో "అమ్మాయి! అతనెవరు! నీకేంగావాలి" అన్నాడు. "నా భర్త బాబూ! ఈ లోకంలో నా అన్నవాళ్లులేని నిర్భాగ్యులం. వారికి నేనూ, నాకు వారే యీ ప్రపంచంలో దిక్కు. వారు గడిచిన ఆరుమాసాలనుంచి ఆ వ్యాధితో బాధపడుతున్నారు. అప్పటినుంచి ఈ యాచన. మొగదిక్కులేని నిస్సహాయను. నాకా అక్షరంరాదు. చీకటి నలుమూలలా, ఆపదలతో కమ్ముకునివస్తే, ఏంచేయగలను! ఆకలిమంటలతో ఆక్రోశిస్తూ మర

ణించలేక, ముఖ్యంగా వారు ఆకలిమంటలతో అలమటిస్తూంటే చూడలేక, మానమర్యాదలు అవతలపెట్టి ఈ పనికి పూనుకొన్నాను. ఇంతో అంతో మానమర్యాదలు మాకువున్నా పరిస్థితులుకు పాదాక్రాంతులైపోయాం" అంది ఆమె.

ఆమె చెప్పిన విషాదగాథతో డాక్టర్ రామారావుకి హృదయం ద్రవించింది. అందులో యవ్వనంలోవున్న ఆ దంపతులిద్దరినిచూచి, ఆ యువతి వ్యాధిగ్రస్తుడైన భర్తను వెంటబెట్టుకొని యాచించి జీవించడం హృదయంలో బాధపెట్టింది. దాన ధర్మాలంటే ఇష్టంలేకపోయినా, ఆయన రూపాయనోటుతీసి ఆమెకుయిచ్చి "రేపు ఉదయం అతన్ని తీసుకొని యిక్కడికిరా! మీతో మాట్లాడాలి" అన్నాడు డాక్టర్.

మొదట అంత కఠినంగా మాట్లాడిన డాక్టర్, అతి కరుణామూర్తిగా, ప్రశాంతతో ఆమెను మరుసటిదినం రమ్మని కోరడం, ఆమెలో సంభ్రమాశ్చర్యాలు ఏక కాలంలో జనింపజేసాయి.

◆ ◆ ◆

రాత్రి భోజనానంతరం పడక కుర్చీలో పడుకొని డాక్టర్ సాయంకాలం తను చూచిన ఆ దంపతులనుగూర్చి ఆలోచించసాగేడు. ఆయనకు ఆ యువతి పొందే కష్టాలినిచూస్తే జాలివేసింది. యవ్వనంలోవున్న ఆమె, వ్యాధిగ్రస్తుడైన భర్తకోసం యాచించవలసివచ్చింది. యవ్వనంలో భర్తచేత సుఖం అనుభవించే అదృష్టం ఆమెకుండినట్లులేదు. అందులో భర్తను వెంటపెట్టుకొని యాచించడం డాక్టరికి కష్టంవేసింది. అదే డాక్టరును, వారికి ఏదో విధంగా సహాయం, ఉపకారంచేసి, యాచించక జీవించేమార్గం చూపమని ఆత్మ ప్రేరేపించినట్లయింది. అంతేకాక ఆ యువతిపై డాక్టర్‌కు ఒక అభిప్రాయమేర్పడింది. లక్ష్మిలాంటి ఆమె ముఖవర్చస్సు మెరుస్తూంటే, అలాంటి అమ్మాయి తన కుమార్తెగాకూడదా అని తలపోసాడు — డాక్టరికి సంతానములేదు — భార్య గతించి అప్పటికి పది సంవత్సరాలు అయింది — ఆయనకా అరవయోపడి సమీపిస్తున్నాదయ! ఈ వైద్యవృత్తిలోనే ఆయన తల ముగ్గుబుట్టలా నెరసిపోయింది—లక్షలార్జించాడు—ఆ పట్టణంలో యిప్పటి అధునాతన పరికరాలతో, ఆధునిక పద్ధతులతో ఒక నర్సింగ్ హోం కట్టించాడు — ఆయన చేతిక్రింద 4, 5 అసిస్టెంట్స్ డాక్టర్లు పనిచేస్తున్నారు—డాక్టర్ ఆమెను తన కుమార్తెగా భావించి — ఆమె కష్టాన్ని బాపదలచుకొన్నాడు — ఆలోచించి ముందుచేయవలసింది - వారినిగూర్చి ఒక నిశ్చయానికి వచ్చాడు.

◆ ◆ ◆

మరుసటిదినం ఉదయం ఆమె తన భర్తను తీసుకొని డాక్టర్ చెప్పినట్లు ఆయనవద్దకు వచ్చింది. డాక్టర్ వారిద్దర్ని ఆహ్వానించి, గదిలోని బెంచిపై కూర్చోమని "అమ్మాయి! నీ పేరేమో నాకు తెలియదు — మనకా ఎట్టి బంధుత్వంలేదు. కాని ఇంత చిన్నవయసులోవుండి సుఖపడాల్సిన కాలంలో నీవిలా కష్టపడుతూండడం నాకు బాధగావుంది. అందులో యువతివి, భర్తను వెంటపెట్టుకొని యాచించడం సహజంగా లోకంలో జరిగేవికావు. భర్త రోగపీడితుడైయున్నాడని ఆతనికోసం నీవు నిజంగా త్యాగంజేసావుకాని ఇకపై ఈ ముష్టెత్తడం మానుకొమ్మని కోరుతున్నాను" అన్నాడు.

ముఖం, వెలవెలబోతుంటే, ఏదో ఉపకారం ఆశించిన ఆమెకు అలాంటిడాక్టర్ కోరికతో నిలువునా కూలిపోయింది "అదేలా బాబూ! యాచించక, ఇక ఏమార్గంనుండి జీవితావసరాలు పొందక, జీవించడం ఏలా బాబూ! వారు చల్లగా వుండివుంటే ఈగతి లేకపోయేది" అంది ఆమె.

"మీరు సుఖంగా జీవించేమార్గం చూపుతాను అయితే అందుకు కొన్ని షరతులు ఒప్పుకోవాలి. అలా ఒప్పుకొంటే ఆ మార్గంమేదో చెబుతాను!"

"చెప్పండి! ఒప్పుకొంటాం" అంది ఆమె.

"మొదటి షరతు - నీవు, ఇకముందు యాచించకుండావుండడం, ఇకపైన ఆ విధంగా మరి ఎన్నటికి

ఆచరించనని ప్రమాణంచేయాలి. అలా చేస్తానా, అందుకు ప్రత్యామ్నాయంగా నీ వెవ్వరిని పోషించడానికి, ఇంత కష్టపడుతున్నావో, అతనిని మరలా సిసలైన మానవునిగామార్చే బాధ్యతనాది ! అందుకు మీ యిద్దరికేమైన అభ్యంతరంవుందా ?" అన్నాడు డాక్టర్. సంభ్రమంతో ఆమె "ఉచితంగా వైద్యం చేస్తారా బాబూ ! చిల్లిగవ్వకూడా యివ్వలేమే" అంది.

"అవును !"

"ఎంతటి దయార్ద్ర హృదయులు మీరు ! దేవుని లాంటివారు. బీదల కష్టాన్ని సులభంగా గ్రహించారు — ఆపదలనే సముద్రంలో కన్నూ మిన్నూ కానక ఈదులాడుతుండే మమ్మల్ని ఒడ్డున చేర్చనున్నారు — మీరు చేసే సహాయానికి వట్టిచేతులతో శూన్యం చూపించడంకన్నా యింకేమిచేయలేము — లేదా వట్టి కృతజ్ఞతా వచనాలు తెల్పగలంగాని, కాని డబ్బుమట్టుకు ఇవ్వలేం" అంది ఆమె.

"పిచ్చిపిల్లా ! అలా అంటావే ! ఇంతకు మునుపే చెప్పాను - అతన్ని తిరిగి మానవునిగా, అందులో నవమన్మథుడుగా మార్చడం నా బాధ్యత- దాంతోపాటు మీ పోషణభారంగూడా నేనే భరిస్తాను — అందుకు మీఇద్దరికీ సమ్మతమేనా" అన్నాడు డాక్టరు.

"విశాల హృదయంతో పూచికపుల్లయిన మా వద్దనుండి పుచ్చుకోక ఉచితవైద్యంచేసి, సహాయం చేస్తానంటే, వద్దంటామా బాబూ ! ఈ లోకంలో మీ లాంటి మహానుభావులు పదిమందివున్న, లోకం చల్లగా వుండేది" అని. "మాకు సమ్మతమే బాబూ" అంది ఆమె. ఆమె భర్త ఆ సంభాషణ సంపూర్తిగా విన్నవాడు కాబట్టి తన సమ్మతంగూడా తెలిపాడు.

ఆమె డాక్టర్ పాదాలపైవాలి "బాబూ" అని కన్నీటి బాష్పాలు రాల్చింది. ఆమెను లేవదీసి "ఎందుకంత క్రిందా మీదులవుతావు — నేచేస్తానన్న ఉపకారాన్ని కొండంతలుచేసి చెప్పుకోనవసరంలేదు— చేసేవృత్తి, చేస్తానన్న ఉపకారం ఒకే చేతిమీదగా జరిగేవిగా. అందులో నేను చేసే పెద్ద ఉపకారమేమిటి ? నీవు అతనితోపాటే ఈ నర్సింగ్ హోంలో వుండిపో" అన్నాడు డాక్టర్.

ఆ దంపతు లిద్దరూ తమ కష్టాలు గట్టెక్కే మార్గం అతి సునాయాసంగా లభించినందుకు ఎంతో ఆనందభరితులయ్యారు — డాక్టర్ యొక్క ఉపకార బుద్ధికి, ఉపకార గుణాన్ని వేనోళ్ల పొగడారు.

♦ ♦ ♦

వారిద్దరిని ఆ దినమే తన నర్సింగ్ హోంలో చేర్పించాడు. అందులో ఒక చక్కని తోటవుంది. అందు ఒక పూరిపాకవుంటే, దానిలోపల వారిద్దరినిఉంచి, అతని పరిచర్యలకు ఆమెనే నియోగించాడు డాక్టర్. వైద్యం ప్రారంభించిన తరువాత వారిద్దరి పేర్లు తెలుసుకొన్నాడు డాక్టర్. అతనిపేరు సుందరం — ఆమె కమల. డాక్టర్ హస్తవాసిలో మహత్తరమైన ప్రభావముంది. సాధారణంగా ఆయన పట్టిన ప్రతికేసూ, అందులో నరాల సంబంధమైన వాటిని తిరిగి తలెత్తకుండా అణిచివేసిన ప్రముఖుడు. సుందరానికి వైద్యం ప్రారంభించిన మూడు మాసాలలోనే, అతని వ్యాధి తగ్గుముఖంపట్టింది. కాలు చేతులూ అతని స్వాధీనంలోనికివచ్చాయి. లేచి నిలుచోడానికి శక్తిమటుకురాలేదు. కమల ఆనందానికి అంతులేదు - పెల్లుబికి వెల్లువలైపారింది. సుందరాన్నిచూచి మురిసిపోయింది. ఏడుకొండల వెంకటేశ్వరునికి 1000 కొబ్బరికాయలు కొట్టుతానని మ్రొక్కుకొనివున్నా అందులో ఆశ్చర్యపడనవసరం లేదు. మరి రెండు నెలలలో సుందరాన్ని సంపూర్తిగా మానవుని రూపంలో తిరిగీ తలఎత్తి తిరగగలిగేటట్లు మార్చివేసాడు డాక్టర్.

ఒకదినం డాక్టర్‌తో సుందరం! "డాక్టర్ బాబూ! మీ పుణ్యంవల్ల ఈ ఘోర వ్యాధినుండి విముక్తి చెందాను. మీ ఋణం ఏలా తీర్చుకోవాలో అర్థంగావటంలేదు. ఆరుమాసాలనుంచి మా దంపతులిద్దర్ని పోషించి వైద్యంచేసారు. కొద్దో గొప్పో చదువుకున్నాను — ఎక్కడన్నా ఉద్యోగం చూచుకొని యిద్ద

రం జీవనం గడుపుతాము. శలవియ్యండి" అన్నాడు.

"నాయనా! అలా తొందరపడుతావెందుకు! నీకు యింకా రెండునెలలు సంపూర్ణంగా విశ్రాంతి అవసరం. మధ్యలో మళ్ళా కష్టపడి పనిచేసావా, నరాలు మళ్ళా బలహీనమై వ్యాధి తిరిగిరావచ్చు. అదీగాక మీరు మీ పోషణననుగూర్చి చింతించనవసరంలేదు. మనస్సులోగూడా అనుకోకండి' అది నా కోరిక!" అన్నాడు డాక్టర్.

డాక్టర్ మాటలకు తిరిగి జవాబివ్వలేకపోయాడు సుందరం.

మరి రెండు మాసాలుగూడా గడిచిపోయాయి. డాక్టర్ తిరిగి వారు వెళ్ళకుండా వేరే గడవు పెట్ట దలచుకొన్నాడు. ఆయన హృదయంలో వుండే ఆలోచన వేరు_ కమల_సుందరం తన ఎదుట తన కళ్ళఎదుట వుండిపోవడమే కావలసింది. కమలను చూస్తే ఆయనకు ఎక్కడలేని ప్రేమాభిమానం, అంతఃకరణము వుండేది. కమలను తన తనయగా భావిస్తుండేవాడు. ఆ రోజు కమల డాక్టర్ వద్ద "బాబూ! మీఋణం ఎన్నటికీ తీర్చలేనట్టిది. అంతేకాక మీ ఆదరణ ప్రశంసనీయం. మీకు చెప్పగలవాళ్ళం కాదుగాని, ఎన్నిదినాలని మమ్మల్ని పోషిస్తారు!నిజంగా యిప్పటికే మీకు పడిన ఋణాన్ని యింకా భారంగా పెంచుకోమంటారా! ఆయన ఆరోగ్యవంతుడైయాడు- యికపైన నన్ను పోషించే భారం యింక వహిస్తాడు! శలవియ్యండి" అంది. కమల అంత మోహమాట పడుతూంటే- డాక్టర్ తన కోరికను వెల్లడించలేకపోయాడు. "అమ్మాయి! మీరు సుఖంగా నవజీవనంతో సుఖజీవనం సాగించండి- ఆపై దేవుడున్నాడు. రేపు వచ్చే 10వతేది మంచి దినం. ఆ రోజు వెడుదురులే!" అన్నాడు.

♦ ♦ ♦

ఆ దినం వచ్చింది. ఆరోజు డాక్టరికి చెడ్డదినంలా కనిపించింది. కన్న కూతురుగా భావించిన కమల తన్నువిడిచి వెడుతున్నరోజు. డాక్టర్ వారిద్దర్ని నూతన వస్త్రాలతో ఆదరించి, సుందరంతో "అబ్బాయి! కమలలాంటి పిల్లని వేయి జన్మాలెత్తినా భార్యగా పొందలేవు. ఉత్తమురాలు. ఆమె ఏ విధంగా, నీవు వ్యాధిలో వున్నప్పుడు జీవనోపాధికై శ్రమపడింది నీకుతెలుసు! యింతవరకూ అష్టకష్టాలుపడ్డ కమలను యికపై సుఖపెట్టడం నీవంతు." అన్నాడు డాక్టర్.

ఆ దంపతులిద్దరూ డాక్టర్ పాదాలకు నమస్కారం చేసారు. ప్రణామం చేసినవారిని'దీర్ఘాయుష్మాన్ భవ' అని దీవించాడు. సుందరంచేతికి ఒక లెటర్ యిచ్చి "సుందరం, ఈ జాబు తీసుకొని సారువఅనే వూరు వుంది - అది యిక్కడికి 10 మైళ్ళలోవుంది. ఈ పేరుగల ఆసామినిచూచావా అతను నీకు ఉద్యోగం చూపిస్తాడు'" అని చెప్పాడు.

విడిచి వెళ్ళలేక వెళ్ళారు ఆ దంపతులిద్దరు. వారు వెళ్లుతూంటే, తన కన్నకూతురు, అల్లుడు తన్ను విడిచి పోతున్నట్లు బాధపడ్డాడు డాక్టర్. ఆయన నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి.'

♦ ♦ ♦

కాలచక్రంలో ఆ మాసం వెళ్ళి మళ్ళీ అదేమాసం వచ్చింది. డాక్టర్ కమలా సుందరాలు వెళ్ళిన కొన్నిదినాలవరకు మనస్సులో బాధపడ్డాడు. ఏదో ఒంటరితనం అనుభవిస్తున్నట్లు తలచసాగాడు. ఆ విధంగా మధనపడ్డాడు.

ఆ రోజు సాయంత్రం డాక్టర్ కారులో షికారుకు వెళ్ళి, 6 గంటల ప్రాంతంలో తిరిగివస్తున్నాడు - నర్సింగ్ హోంవైపు. అనుకోకుండా, ఆకస్మికంగా ఆకాశం మేఘాలతోనిండి ప్రళయంగా గాలితోపాటు వర్షించసాగింది. ఆ పెనుగాలి, వర్షంతో ప్రశాంత వాతావరణం అల్లకల్లోలమైపోయింది. నర్సింగ్ హోం పరిసర ప్రాంతంలో కారు వుండగా డాక్టరుకు తన కారుకు నూరు గజాలలో ఓ స్త్రీ వీచే ప్రళయ పెనుగాలిని, వర్షాన్ని లెక్కచేయక, జంకక, ఏకాకిగా ముందుకు చకచక ప్రయాణం సాగిస్తున్నది. అంత పెద్ద గాలివానలో ప్రయాణం చెయ్యడం

ప్రాణాపాయమైనా ఆమె లక్ష్యపెట్టడంలేదు. కారు లైట్లు ముందువెడుతున్న స్త్రీపై ప్రసారింపబడ్డాయి. ఆ రోడ్డుకు యిరువైపులా పెద్దపెద్ద చెట్లు భీకర రాక్షసులలా ఆ కారు చీకట్లలో కనుపిస్తున్నాయి. కాని, ఆకస్మికంగా ఘోరప్రమాదం జరిగింది. రోడ్డు కిరువైపులా ప్రళయమార్తాండానికి ఉర్రూతలూగిపోతున్న చెట్లు, అందులో పెద్ద పెద్దవి విచ్చలవిడిగా వూగిపోతున్నాయి. కూకటి వేళ్ళతోపాటు వూగులాడిపోతున్న ఆ చెట్టు. కొమ్మలతోపాటు పెళపెళమంటూ ముందు వెడుతున్న స్త్రీపై విరిగి పడింది. ఆ స్త్రీ చేసిన ఆర్తనాదానికి, డాక్టరుతో పాటువున్న అతని మిత్రుడు హడలిపోయాడు. కారాపి, ప్రమాదానికి లోనైన ఆ వ్యక్తి రక్షణకై డాక్టర్ ఆ చెట్టుకొమ్మల మధ్య గాలించి, బహు ప్రయాసపై, తన మిత్రుడి సహాయంతో ఇవతలకు తీసాడు. ఆ హతురాలు యొక్క తల రెండుగా చీలి నెత్తురుముద్దగా వుంది. రక్తంధార ప్రవాహంగా వెళ్ళిపోయింది. కాని ఆ వ్యక్తి తలపై తన చీర పమిటికొంగు కప్పుకొన్నందువల్ల వ్యక్తిని గుర్తించ వీలులేకపోయింది.

నర్సింగ్ హోంకు చేర్చి, తగిన ప్రథమ చికిత్స నిమిత్తం, తలపైనుండి ముసుగు తొలగించిచూచిన డాక్టర్ ఒక్కనిమిషం నిర్ఘాంతపడి, అలాగే నోట మాటలేక నిలచిపోయాడు. ఆయన నోట నుండి "కమలా నీవా" ! అనే రెండే రెండుమాటలు వెలువడ్డాయి. కమల అప్పటికి స్పృహలోలేదు. ఆమెకు చేయవలసిన వైద్యంచేసి, ఆమె స్పృహకలిగి తిరిగి మన ప్రపంచములోనికి ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ కూర్చున్నాడు డాక్టర్. ఆయనకు కమల ఒంటరిగా, అందులో రాత్రి సమయంలో దూర ప్రాంతంనుండి రావలసిన అవసరం కనుపించలేదు.

రెండుగంటలకు తరువాత కమల కన్నులు తెరచి నలువైపులా తిలకించింది. తన ప్రక్కనే డాక్టర్ నిలబడివుండడం చూచి ఆమె చేయెత్తి నమస్కరిస్తూ చిరునవ్వు నవ్వింది. ఆమెలో ఒక విధమైన తేజస్సు రాసాగింది. డాక్టర్ "కమలా! ఏలావుంది ! వంటరిగా వచ్చేవేం ! సుందరం ఎక్కడ ?" అన్నాడు ఆత్రుతగా.

అందుకు సమాధానం, వెక్కి వెక్కి ఏడుస్తూ, హీనస్వరంతో "ఏమని చెప్పను బాబూ ! నాది ఒంటరి జీవితం అయిపోయింది."

"ఆయాసపడక తిన్నగాచెప్పు"

లేనిశక్తిని తెచ్చుకొని కమల "ఇక్కడనుంచి వెళ్ళిన ఆరుమాసాలవరకు మా జీవితం ఆనందంగా వెళ్ళిపోయింది. కాలం ఒకవిధంగా వుండదుగా ! తిరిగీ మళ్లీ నా కష్టదినాలు నన్ను వెంబడించాయి. మసూచికవల్ల అందవిహీననయ్యాను. ప్రేమ-వివాహం చేసుకొన్న సుందరం నేను, మధ్యతరగతికి చెందినవారమే. కాలేజివరకు చదివి ఆదర్శంగా వివాహమాడిన సుందరం పరిస్థితులైనా ఆలోచించక, కాలానికి దాసుడై అందవిహీననైన నన్ను, యింటి నుండి వెళ్ళగొట్టాడు." అంది కమల. 'సుందరంపై వచ్చిన ఆగ్రహాన్ని పట్టలేకపోయాడు. "నీచుడు — నీవు చేసినసేవను మరచిన కృతఘ్నుడు; పామును చంపినట్లు యిలాంటివారిని చిత్రవధచేసినా పరవాలేదు." "అమ్మాయి నిన్ను నా కన్నకూతురుగా చూచుకొంటాను. మరేం భయంలేదు—బాధపడకు" అని ఊరడించాడు.

కాని కమలమటుకు "బాబూ ! సుందరంలేని జీవితం జీవించలేను. భర్తచే అసహ్యించుకొని జీవించడంకన్నా జీవితం చాలించడం మంచిది. నా కడసారి కోరిక నెరవేరింది" అంది ఆమె.

డాక్టర్ ఆమెకు తగిలినగాయాలు పరీక్షించి, అవి ప్రమాదానికి దారితీస్తున్నాయని గ్రహించాడు. నివారణకై తగిన ప్రయత్నంచేసినా అప్పటికే రక్తం ఎక్కువగా వెళ్ళిపోయినందున ప్రమాదాన్ని నివారించడం వీలుపడలేదు — అసాధ్యం అయింది. కమల

రాత్రంతా స్పృహలోలేదు. తెలతెల తెల్లవారుతుండగా ఆమె స్పృహలోనికి వచ్చింది. కిటికీలోనుంచి అరుణకాంతులు ఆమెపై ప్రసరిస్తుండగా డాక్టర్ చేతుల్ని తన చేతులలోనికి తీసుకొంది. మరు నిమిషంలో ఆమెలోని ప్రాణవాయువులు అనంత విశ్వంలో కలసిపోయాయి.

"దురదృష్టవంతురాలు! నిర్భాగ్యజీవి! సుమతిలా భర్తకు సేవ చేసి, కడకు సుఖం అనుభవించబోతే అది మేడిపండుగా అయింది. ఆమె ఆత్మకు శాంతి కలుగుగాక" అన్నాడు డాక్టర్. అవునన్నట్లు అతని కంటి కొలికిలో నిలిచివున్న అశ్రుకణాలు జలజల రాలాయి.

(ఒక తమిళ కథ ఆధారంగా)

"ఓరే రామం! మనుషుల మీద ఎప్పుడూ ఆధారపడివుండే జంతువేదో చెప్పు?"

అని పంతులు జంతువులు మనుషులకు చేస్తూవున్న సహాయాన్ని గురించి పాఠాన్ని బోధిస్తూ క్లాసులో రామాన్ని అడిగాడు.

రామం బల్లమీదనుండి చటుక్కున లేచి, అదురూ బెదురూ లేకుండా "జలగ, సార్" అని సూటిగా జవాబునిచ్చాడు.

♦ ♦ ♦

(తనలో తాను!) "ఆ మహానుభావుడు నేను అడగ్గానే రెండువేలు బదులు ఇచ్చాడు. ఇవ్వాళ తన అవసరాలకు ఆ సొమ్ముని ఇచ్చేయమని అడిగాడు ఆబాకీని తప్పని సరిగా తీర్చివేయాలి. లేకపోతే ఆయన బాధపడుతాడు. కాని అంత పెద్ద మొత్తాన్ని ఇవ్వాళ ఎవరు ఇస్తారు? ఇది క్లిష్టసమస్య! దీన్ని ఎలా తేల్చగలుగుతానో బుర్రనెంతగాలించినా తెలియడం లేదు. ఈ సుడిగుండాన్నుంచి తప్పుకోడానికి ఏ సాధనోపాయం మంచిది చెప్పుమా?" అని ఒకాయన తర్జన భర్జన చేస్తూన్నాడు.

♦ ♦ ♦

"మొన్న రాత్రి రెండుగంటలకు ఈ పర్సు దొరికిందికదూ. దాన్ని అప్పుడే ఎందుకు తెచ్చి ఇచ్చావుకాదు" అని పోలీసు అతణ్ణి క్రాసు పరీక్ష చేశాడు.

"అంత అర్ధరాత్రిలో ఎలా తెచ్చి ఇయ్యను" అని వాడు ఆ అధికారికేసి చూస్తూ జవాబిచ్చాడు.

"అలాగయితే నిన్న ప్రొద్దున్నే ఇచ్చి వుండాలసింది"

"నిన్న దాన్లో ఏమీ లేదు. అంచేత ఇవ్వాళటివరకూ వేచివుండాలసివచ్చింది" అని తడుముకోకుండా జవాబిచ్చాడు.

డాక్టరు వి. యన్. శర్మ